దిన పత్రిక తొలి సమయం

ఆదివారం | 28 | జూన్ | 2026

## ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో ఆరో వార్డులో ఫారాల పంపిణీ



**తొలి సమయం, ఇల్లందు;జూన్, 26:**
ఇల్లందు పట్టణంలోని 6వ వార్డులో భారత ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా ఓటర్ల గణన ఫారాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. నా పోలింగ్ బూత్ నా బాధ్యత అనే నినాదంతో ప్రతి అర్హ ఓటరు పేరు ఓటరు జాబితాలో ఉండేలా అవగాహన కల్పిస్తూ, ఇంటింటికీ వెళ్లి ఓటర్లకు గణన ఫారాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో భారత రాష్ట్ర సమితి బూత్ లెవెల్ ఏజెంట్లు (లు), బూత్ లెవెల్ అధికారి కంకణాల శారదతో కలిసి పాల్గొని ఓటర్లకు అవసరమైన సూచనలు అందించారు. ఇల్లందు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్‌చార్జ్ శ్రీమతి బాణోత్ హరిప్రియ నాయక్ ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రతి ఓటరు తన పేరు ఓటరు జాబితాలో ఉందో లేదో నిర్ధారించుకోవాలని, అవసరమైన వివరాలను సకాలంలో నమోదు చేసుకోవాలని సూచించారు. ఓటు హక్కు పరిరక్షణలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన ప్రజాప్రతినిధులు



**తొలి సమయం,ఇల్లందు;జూన్, 27:**
కామేపల్లి మాజీ జెడ్పీటీసీ, డీసీసీబీ డైరెక్టర్ మేకల మల్లిబాబు యాదవ్ సోదరుడు మేకల మల్లికార్జునరావునాగలక్ష్మి దంపతుల కుమారుడు మేకల ముత్తయ్య, ఖమ్మం రూరల్ మండలం గుర్రాలపాడుకు చెందిన చంద్రకాని నాగయ్యనీలమ్మ దంపతుల కుమార్తె శైలజ వివాహం పండితాపురంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో వైభవంగా జరిగింది. ఈ వేడుకకు ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు నూతి సత్యనారాయణ గౌడ్, సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, డీసీసీబీ డైరెక్టర్ మేకల మల్లిబాబు యాదవ్ దంపతులు, రాంరెడ్డి గోపాల్ రెడ్డితో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు, బంధుమిత్రులు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి, అన్యోన్య దాంపత్య జీవితంతో కలకాలం సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు.

## ఖమ్మం ద్వితీయ శ్రేణి మెజిస్ట్రేట్ క్షత్రి విజయ కుమారికి ఘన సన్మానం

### తన జూనియర్ ఉన్నత స్థానానికి చేరడం గర్వకారణం

### సీనియర్ న్యాయవాది దంతాల ఆనంద్



**తొలి సమయం, ఇల్లందు;జూన్, 27:**
ఇటీవల ఖమ్మం ద్వితీయ శ్రేణి మెజిస్ట్రేట్ (సెకండ్ క్లాస్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్) గా నూతనంగా పదవీ బాధ్యతలు స్వీకరించిన క్షత్రి విజయ కుమారిని శనివారం ఇల్లందు పట్టణంలో ఘనంగా సన్మానించారు. పదవీ బాధ్యతలు చేపట్టిన అనంతరం మొదటిసారి ఇల్లందు పట్టణానికి విచ్చేసిన ఆమె, ఇల్లందులోని తన గురువుగారైన ప్రముఖ సీనియర్ న్యాయవాది శ్రీ దంతాల ఆనంద్ నివాసానికి వెళ్లారు. ఈ సందర్భంగా దంతాల ఆనంద్ ఆమెకు పుష్పగుచ్ఛం అందించి, శాలువాతో ఘనంగా సత్కరించి, మెమొంటో (జ్ఞాపిక) బహూకరించారు. అనంతరం సీనియర్ న్యాయవాది దంతాల ఆనంద్ మాట్లాడుతూ.. తన వద్ద జూనియర్ న్యాయవాదిగా వృత్తిపరమైన మెళకువలు నేర్చుకున్న విజయ కుమారి, నేడు ద్వితీయ శ్రేణి మెజిస్ట్రేట్‌గా ఉన్నత స్థానానికి ఎంపిక కావడం తనకు ఎంతో సంతోషాన్ని, గర్వాన్ని కలిగిస్తోందని ఆనందం వ్యక్తం చేశారు. ఆమె సాధించిన ఈ విజయం ఇల్లందు బార్ అసోసియేషన్‌కే గర్వకారణమని కొనియాడారు. గతంలో లా కోర్సుల్లో మూడు గోల్డ్ మెడల్స్ సాధించి తను చదివిన కళాశాలలకే వన్నె తెచ్చిన ప్రతిభావంతురాలని ప్రశంసించారు. భవిష్యత్తులో విజయ కుమారి మరిన్ని ఉన్నత పదవులను అధిరోహించాలని ఆకాంక్షించారు. అదేవిధంగా, విజయ కుమారి తల్లి శ్రీమతి ఠాకురి ఇందిరా కూడా గతంలో ఇల్లందు ద్వితీయ శ్రేణి మెజిస్ట్రేట్ గా విధులు నిర్వహించారని, నేడు కూతురు కూడా అదే బాధ్యతాయుతమైన న్యాయమూర్తి పదవిని చేపట్టడం విశేషమని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేసుకున్నారు. ఈ సన్మాన కార్యక్రమంలో పలువురు స్థానిక న్యాయవాదులు, ప్రముఖులు పాల్గొని మెజిస్ట్రేట్ విజయ కుమారికి శుభాకాంక్షలు తెలిపారు.

## మరిపెడలో పల్స్ పోలియోకు సర్వం సిద్ధం

### సిబ్బందితో సన్నాహక సమావేశం నిర్వహణ

### మండలంలో 7,200 మంది పిల్లల గుర్తింపు

### వైద్యాధికారి డాక్టర్ గుగులోతు రవి




**తొలి సమయం మరిపెడ జూన్ 27**
మహబూబాబాద్ జిల్లామరిపెడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో (ఆదివారం) జరగబోయే జాతీయ పల్స్ పోలియో కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు సిద్ధం చేసినట్లు వైద్యాధికారి డాక్టర్ గుగులోతు రవి తెలిపారు. ఈ సందర్భంగా శనివారం పిహెచ్‌సి ఆవరణలో వైద్యులు, ఆరోగ్య సిబ్బందితో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కార్యక్రమ విజయవంతానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. మరిపెడ మున్సిపాలిటీలోని 15 వార్డులతో పాటు, మండలంలోని 48 గ్రామ పంచాయతీలను కవర్ చేస్తూ పకడ్బందీ ప్రణాళికను రూపొందించినట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమ ముఖ్యాంశాలు: లక్ష్యం: 0 నుండి 5 సంవత్సరాల లోపు ఉన్న 7,200మంది పిల్లలకు పోలియో చుక్కలు వేయడం. కేంద్రాల ఏర్పాటు: మొత్తం 34 పోలియో బూత్‌లు, 1 మొబైల్ బూత్, మరియు బస్టాండ్‌లో ప్రత్యేక బూత్ ఏర్పాటు. రూట్ల విభజన: పర్యవేక్షణ కోసం ఎడ్జెర్ల రూట్, తానంచెర్ల రూట్, చిల్లంచెర్ల రూట్ అనే 3 ప్రధాన రూట్లను ఏర్పాటు చేసి సూపర్ వైజర్లను నియమించారు. సమావేశంలో పాల్గొన్నవారు: ఈ సన్నాహక సమావేశంలో డాక్టర్ పూజిత, డాక్టర్ స్వామి, డాక్టర్ కిరణ్, పబ్లిక్ హెల్త్ నర్సింగ్ ఆఫీసర్ , మంగమ్మ, హెల్త్ సూపర్‌వైజర్లు ఆచార్యులు, మాధవి, పల్లె దవాఖానా సిబ్బంది, ఏఎన్ఎంలు , హెల్త్ అసిస్టెంట్లు, ల్యాబ్ టెక్నీషియన్లు, 70 మంది ఆశా, ఆరోగ్య కార్యకర్తలు, అంగన్‌వాడీ కార్యకర్తలు , వాలంటీర్లు పాల్గొన్నారు. వైద్యాధికారి విజ్ఞప్తి: ఐదేళ్ల లోపు పిల్లలు ఉన్న తల్లిదండ్రులందరూ రేపు ఉదయాన్నే దగ్గరలోని పోలియో బూత్‌కు వెళ్లి తమ పిల్లలకు తప్పకుండా పోలియో చుక్కలు వేయించి, ఈ బృహత్తర కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వైద్యాధికారి డాక్టర్ రవి కోరారు.

## గుడిసె వాసుల హామీలు నెరవేర్చని కాంగ్రెస్, బీఆర్ఎస్: సీపీఎం



**తొలి సమయం, ఇల్లందు;జూన్, 27:**
మండలంలోని సీఎస్పీ గ్రామపంచాయతీ పరిధిలోని దేవులపల్లి యాకయ్య నగర్‌లో ఎనిమిదేళ్లుగా నివసిస్తున్న గుడిసె వాసులకు ఎన్నికల సమయంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు ఇచ్చిన హామీలు ఇప్పటికీ అమలు కాలేదని సీపీఎం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు, రాష్ట్ర కమిటీ సభ్యుడు కేజే రమేష్ విమర్శించారు. శనివారం కాలనీని సందర్శించి గుడిసె వాసుల సమస్యలను పరిశీలించిన అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ, భారీ వర్షాలతో గుడిసెలు దెబ్బతినడంతో పాటు రోడ్లు, డ్రైనేజీలు, తాగునీటి వంటి కనీస మౌలిక వసతులు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాదయాత్ర సందర్భంగా ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని, గుడిసె వాసులకు ఇళ్ల పట్టాలు, ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసి అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు అబ్దుల్ నబీ, మండల కార్యదర్శి ఆలేటి కిరణ్ కుమార్‌తో పాటు పార్టీ నాయకులు పాల్గొన్నారు.